సమస్యల స్వాగతం



చేవెళ్లలో రంగులు వేయకుండా వదిలేసిన నూతనంగా నిర్మించిన అదనపు గదులు, కిచెన్ షెడ్

- రేపటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- అసంపూర్తిగా 'మన ఊరు– మన బడి' పనులు
- చేసిన పనులకు బిల్లులు రాక నిలిపివేత
- ఎప్పటిలాగే ఈ ఏడాదీ తప్పని తిప్పలు

చేవెళ్ల: రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎప్పటిలాగే ఈ సంవత్సరంలో కూడా విద్యార్థులకు పాత సమస్యలే స్వాగతం పలకనున్నాయి. పాఠశాలల్లో గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు– మన బడి' కింద చేపట్టినఅభివృద్ధి పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. చేవెళ్ల మండలంలో 24 పాఠశాలలను 'మన ఊరు–మన బడి' కింద ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో చేపట్టే పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేసింది. ప్రభుత్వం మారటంతో నిధులు రాక రెండేళ్లుగా ఈ పనులు పూర్తికాకుండా పాఠశాలల్లో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండలంలోని 9 హైస్కూళ్లు, 11 ప్రైమరీ స్కూళ్లు, 04 ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, లైబ్రరీ ఏర్పాట్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, మోడ్రన్ కిచెన్‌లు, టాయిలెట్లు, ఫర్నీచర్ తదితర వాటిని కల్పించేందుకు కావాల్సిన నిధులను విడుదల చేసింది. మొదట్లో పలు పాఠశాలల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు కొంతమేరకు డబ్బులు విడుదలయ్యాయి. మిగతా పనులకు డబ్బులు రాలేదు. ఇలా మండలంలో చాలా పాఠశాలల్లో అసంపూర్తి పనులు దర్శనమిస్తున్నాయి. వీటికి మంజూరైన నిధులు విడుదల చేసి త్వరగా పాఠశాలల్లో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

సమస్యలకు నిలయాలు


షాబాద్: తాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన వంట గది

షాబాద్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలుగా నిలయాలుగా మారాయి. ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 9, ప్రాథమిక పాఠశాలలు 43 ఉన్నాయి. మొత్తం 260 ఉపాధ్యాయుల పోస్టులకుగాను, 232 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. 28 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 'మన ఊరు–మన బడి' పథకం కింద మండలంలో 37 పాఠశాలలకు ఎంపిక చేశారు. ఇందులో సర్దార్‌నగర్, అంతారం, కక్కులూర్ గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. మిగతా గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పనులు చేసిన వాటికి బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ, చర్లగూడ, ఊబ్బగుంట, దైవాలగూడ, తాళ్లపల్లి తదితర గ్రామాల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి. విశాలమైన ప్రాంగణాలు ఉన్న ప్రహరీ లేక పశువులు సంచరిస్తున్నాయి. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



మన ఊరు–మన బడి కింద పాఠశాలకు రెండు అదనపు గదులు, ఒక కిచెన్‌షెడ్ మంజూరైంది. నిర్మాణం కూడా పూర్తి చేశారు. దాదాపు పనులు అన్ని పూర్తయ్యాయి. కలర్ వేయటం ఫర్నీచర్ పనులు మిగిలిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదని వీటిని చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం పాఠశాలకు గదులు సరిపోవటం లేదని, రంగులు వేయకుండానే ఉపయోగించుకుంటున్నాం.

–సుధాకర్, ఉపాధ్యాయుడు, చేవెళ్ల పాఠశాల

క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడానికి చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పాలమాకుల కృష్ణయాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, విజయ్‌రాజ్, ఈరయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు


విద్యార్థులతో మాస్టర్లు

కొందుర్గు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరైనట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. అనంతరం విజేతలకు బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు రాము, బాల్‌రాజ్, నందు, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల కేంద్రంలో మంగళవారం కర్రే సత్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5 వేల చొప్పున, పవన్‌కుమార్‌రెడ్డి రూ.3 వేల ఆర్థిక సాయం మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న భీంభరత్, ఆలయ కమిటీ సభ్యులు

షాబాద్: మండల పరిధిలోని కొమరబండలో కొలువుదీరిన శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరిందని, పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను నగరంలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, సభ్యులు సత్యనారాయణ, సునీత, సత్తయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రబోస్, తదితరులు ఉన్నారు.

కేసారం ఓటర్లను చేవెళ్ల వార్డులోనే కలపాలి

చేవెళ్ల: మున్సిపాలిటీ వార్డుల విభజనలో భాగంగా కేసారం వార్డు ఓటర్లను చేవెళ్ల వార్డులోకే తీసుకోవాలని ఇతర వార్డులో చేర్చొద్దని ఆ వార్డు ప్రజలు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేకాధికారి శ్రీధర్, కమిషనర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కేసారం చేవెళ్ల పంచాయతీ పరిధిలో కొనసాగిందన్నారు. కొత్తగా ఒకసారి పంచాయతీగా మారి ఇప్పుడు మళ్లీ మున్సిపాలిటీలో కలిసిందన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న మున్సిపాలిటీల వార్డుల విభజనలో కేసారం ఓటర్లతో మల్కాపూర్ ఓటర్లను కలుపుతున్నట్లుగా తయారు చేసిన వార్డు విభజన సరైందిగా లేదని దీనిని మార్చాలని కోరారు. దీనిపై అధికారులు స్పందించి సరైన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి తప్పకుండా పరిశీలిస్తామని, అభ్యంతరాలపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్, గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడిలో మంగళవారం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గోగు దేవకమ్మ, గోగు వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ సుమారు 400 మందికి ఉచితంగా మధుమేహ, కంటి పరీక్షలను నిర్వహించారు.

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించండి

విద్యార్థుల తల్లితండ్రులతో ఎంఈఓ మనోహర్


బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ మాదిరిగా విద్యార్థులకు అన్ని వసతులతో ఇంగ్లిష్‌లో బోధన జరుగుతుందని, చిన్నారులను సర్కార్ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, కంసాన్‌పల్లి, చౌలపల్లి, కిషన్‌నగర్, హాజిపల్లి, పీర్లగూడ, వాచ్యతండా, కర్ణంకుంటతండా, గిరాయిగుట్టతండాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రైవేట్‌కు వెళ్తున్న విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు డిజిటల్ బోధన కొనసాగుతుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లితండ్రులు తమ పిల్లల చదువు కోసం అప్పులు పాలు కావొద్దని, ప్రభుత్వం విద్యార్థులకు ప్రైవేట్‌కు దీటుగా బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రసూల్, శ్రీధర్‌రెడ్డి, సత్యం, తిరుమలయ్య, లక్ష్మీదేవమ్మ, మేఘాబాయి, శాంతాబాయి, డి.సత్యం, శంకర్‌నాయక్, సతీష్, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


షాబాద్: మన్‌మర్రిలో బడిబాట ర్యాలీ

షాబాద్: ప్రభుత్వ పాఠశాల్లోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు చిన్నారులను ప్రైవేట్ బడుల్లో చేర్పించి అప్పుల పాలు కావొద్దని సూచించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులారా ఆలోచించండి

ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని, తల్లిదండ్రులు ఆలోచించాలని ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్‌మర్రిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ప్రైవేట్‌కు దీటుగా అన్ని వసతులతో నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. ఈ సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో డిజిటల్ విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ చైర్మన్ వెంకటేశ్, రమేశ్, జంగయ్య, శ్యామలమ్మ ఉన్నారు.

పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలోని రైతులు పండ్ల తోటలను పెంచుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఉపాధీ హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలను పెంచుకోవడానికి సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా జామ, మామిడి, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటలు వేసుకోడానికి వీలుంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు దగ్గరలోని పంచాయతీ, ఉపాధి హామీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గట్లపై టేకు, మలబార్ వేప, యూకలిప్టస్ చెట్లు పెంచితే మొదటి రెండు సంవత్సరాలు మెయింటెనెన్స్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీఓ గిరిబాబు, ఏపీఓ నాగభూషణం పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆత్మగౌరవమే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సమాజంలో దివ్యాంగులు గౌరవంతో జీవించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో కేంద్ర మంత్రి డీకే.అరుణ ప్రోత్సాహంతో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలింకో ఆర్గనైజేషన్ హైద్రాబాద్(ఏఎల్ఐఎంసీఓ) సహకారంతో అవయవ, చలన పరికరాల పంపిణీ కోసం ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై మాట్లాడుతూ.. దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రత్యేక అసరాలు ఉన్న దివ్యాంగులకు సమాజం అండగా నిలవాలని కోరారు. సేవయే బీజేపీ సిద్ధాంతమని, ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అవయవ పరికరాలను అందిస్తూ వారిని ఆదుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, వంశీకృష్ణ, మల్చలం మురళీ, ఎంకనోళ్ల వెంకటేశ్, లక్ష్మికాంత్‌రెడ్డి, ప్రశాంత్, అరవింద్‌చారి, సురేష్, రాజు, మహేందర్‌రెడ్డి, నర్సింహ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను బీజేపీ నేతలు రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జై బాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం చేస్తోందన్నారు. పార్టీ అధినేత రాహుల్ గాంధీ దేశ ప్రజలందరినీ ఏకం చేసేందుకు ప్రయత్నిస్తుంటే బీజేపీ నేతలు మాత్రం ప్రజలు, ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లకు అండగా నిలుస్తూ వారికి రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేయడం లేదన్నారు. దేశ సంపద కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉందని, ఫలితంగా దేశంలో ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సులోచన, కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, విశాల శ్రావణ్, ఇబ్రహీం, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జంగయ్య, నాయకులు

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం పార్టీ మండల 16వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జంగయ్య పాల్గొని ముందుగా మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖజానాలో డబ్బులు లేవని చెప్పటం ఎంతరవకు సమంజసమని ప్రశ్నించారు. చేవెళ్లలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు అందించాలని, వారికి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలకు సీపీఐ అండగా ఉంటుందని, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో 27 మంది కౌన్సిల్ సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు నాయకులు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శిగా ఎం.సత్తిరెడ్డి రెండో సారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఎండీ మక్బుల్, వడ్ల మంజులను ఎనుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి, నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

ఎంఈఓ చంద్రశేఖర్


కార్మికులతో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

కేశంపేట: పాఠశాలల పునఃప్రారంభం తర్వాత విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ చంద్రశేఖర్ నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆహారం వండే ముందు పాత్రలను శుభ్రమైన నీటితో శుభ్రం చేయాలన్నారు. వంటకు మంచినీటిని ఉపయోగించాలని సూచించారు. బియ్యం శుభ్రంగా కడిగన తర్వాతనే వండాలని తెలిపారు. ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శరత్‌చంద్ర, ఎల్లయ్య, మల్లేశ్, మల్లయ్య, రామకృష్ణతో పాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన కాంగ్రెస్

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్


మాట్లాడుతున్న వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: దళితుల అభివృద్ధి తమతోనే సాధ్యమని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ ఆనాడు బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఎమర్జెన్సీ విధించింది కదా అని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలహాబాద్ కోర్టు ఇందిరాగాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు ఆనాడు అధికారం ఉండటంతో ఎమర్జెన్సీని విధించి అందరిని జైల్లో వేసి రాజ్యాంగాన్ని అగౌరపరిచారని గుర్తుచేశారు. అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కు కోసమే నేడు అన్ని పార్టీల నాయకులు దళితుల ఇళ్ల వద్దకు వస్తున్నారే తప్పా దళితులపై ప్రేమతో కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను ఓటు బ్యాంకుగానే చూసిందని, వారి అభివృద్ధికి, సంక్షేమానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. మోదీ క్యాబినెట్‌లో 36 మంది దళితులు కేంద్ర మంత్రులుగా పనిచేశారని, బీజేపీలో అత్యధిక ఎంపీ స్థానాల్లో వారే ఉన్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలను మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, ప్రశాంత్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేష్, కుర్మయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్


మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులపై ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు వివరించి, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాటలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఇంటింటికీ తిరిగి వివరించాలని తెలిపారు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలను మళ్లీ ప్రారంభించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను ముందుగానే శుభ్రం చేయించి సిద్ధంగా ఉంచాలన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విద్యార్థులకు పాఠశాల తెరిచిన మొదటిరోజే పంపిణీ చేయాలన్నారు. పాఠశాలల్లో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తహసీల్దార్ కృష్ణయ్య


కేశంపేట: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ సరిత


మొయినాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో తహసీల్దార్ కృష్ణయ్య, పామెనలో నయాబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. దామరగిద్దలో 29, పామెనలో 40 ఫిర్యాదులు వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, దావల్‌గారి గోపాల్ రెడ్డి, గ్రామ నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సరిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌలపల్లి, తొమ్మిదిరేకుల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తొమ్మిదిరేకులలో నిర్వహించిన సదస్సులో ఆర్డీఓ పాల్గొని మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొమ్మిదిరేకులలో 17, చౌలపల్లిలో 08 దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ అజాంఅలీ, నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐలు నివేదిత, చెన్నకేశవులు, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలకు పరిష్కారం

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని మాట్లాడుతూ.. ఎంతో కాలంగా పరిష్కారం కాని భూ సమస్యలను రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి పరిష్కరిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 115 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామాల్లో తహసీల్దారు పార్థసారధి ఆధ్వర్యంలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చించోడ్‌లో 68, సోలీపూర్‌లో 13 ఫిర్యాదులను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్, ఆర్ఐలు సలీం, రోజ, రెవెన్యూ అధికారులు నరేందర్, జ్యోతి, నర్సింహ, సూర్యప్రకాశ్, శ్రీను, చెన్నయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 320 దరఖాస్తులు

కొత్తూరు: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 3 నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు కొత్తూరు, తిమ్మాపూర్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. కాగా మండలంలో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 320 దరఖాస్తులు రాగా అందులో సగానికి పైగా పరిష్కారం చేసినట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు. పరిష్కారం కానీ దరఖాస్తుల వివరాలను రైతులకు తెలియజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంజీవ, నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.